


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 335 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 5 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :12 ISSUE :335 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 5 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!



- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు

- మిగతా 2లో

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్

- మిగతా 2లో



## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

పెన్ పవర్ డెస్క్:సై, గజినీ, ఛత్రపతి మొదలైన బ్లాక్ బస్టర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం

- మిగతా 2లో



# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు



- గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం.
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని వెల్లడి.
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం.
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహం.
- సంక్షేమం ఆగదు.. అభివృద్ధి ఆగదని చంద్రబాబు.

- మిగతా 2లో

"గత ఐదేళ్లది విధ్వంసం... మాది పునర్నిర్మాణం"

| ఆర్థిక గణాంకాలు | రెండేళ్లలో సంక్షేమం | ఉద్యోగాల కల్పన |
|---|---|---|
| మొత్తం అప్పులు రూ. 9.74 లక్షల కోట్లు | రూ. 1,49,401 కోట్లు | 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు |

### దిద్దుబాటు చర్యలు

- పెండింగ్ బిల్లుల్లో రూ.29,000 కోట్లకు పైగా చెల్లింపు.
- ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్.
- రీ-నెగోషియేషన్ ద్వారా రూ.8,269 కోట్ల ఆదా.
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ.
- రూ.29,890 కోట్ల కేంద్ర నిధుల సమీకరణ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది "పునర్నిర్మాణం" అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

**గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం**

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి "బ్రాండ్ ఆంధ్రప్రదేశ్"ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.



## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

### మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

- మిగతా 2లో

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

### లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ. 19,619 కోట్లు అందాయని కేంద్ర

- మిగతా 2లో



## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామన్న మంత్రి గొట్టిపాటి
- ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి
- పీఎం సూర్య ఘర్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలు చేస్తామని స్పష్టం
- జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శ
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం చేశామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 'ట్రూ డౌన్' చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని,

- మిగతా 2లో



### ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

## పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.

- మిగతా 2లో



## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

- మిగతా 2లో

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

### విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం



- త్రిషపై వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- అధికార టీవీకే అహంకారంతో వ్యవహరిస్తోందన్న ఎంకే స్టాలిన్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# విడదల యాక్టివ్ అవ్వడానికి కారణమదేనటగా?

వైసీపీ నేత విడదల రజని మళ్లీ చిలకలూరి పేట నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీ నుంచి తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి గెలిచేందుకు ఆమె ఉవ్విళ్లూరుతున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గంలో జరిగే వైసీపీ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ తిరిగి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నాయకత్వం కూడా చిలకలూరి పేట ఇన్ ఛార్జిగా విడదల రజనిని నియమించడంతో ఆమె మరొకసారి గెలిచి తన సత్తా చూపాలని చూస్తున్నారు. ఇటీవల జరిగిన వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించినట్లు పార్టీ నాయకత్వానికి నివేదికలు అందాయి.

విడదల రజిని 2014లో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శిష్యురాలిగా తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. విఆర్ ఫౌండేషన్ స్థాపించి నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టీడీపీ నుండి ప్రత్తిపాటి పుల్లారావు అక్కడ పోటీ చేస్తుండడంతో 2018లో వైసీపీలో చేరారు. ఆమె 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పై 8301 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 11న జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విడదల రజిని 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనససభ ఎన్నికలలో గుంటూరు పశ్చిమ నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి చేతిలో 51150 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

సామాజికవర్గం పరంగా... విడదల రజని ఆర్థికంగా బలమైననేత. సామాజికవర్గం పరంగా కూడా ఆమెకు కలసి వచ్చే అంశమే. భర్త కాపు సామాజికవర్గం కావడం కూడా ఆమెకు రాజకీయంగా కలసి వస్తుందని అంటున్నారు. విడదల రజని కుటుంబం విదేశాల్లో వ్యాపారాలు చేసి బాగానే సంపాదించారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై వరసగా కేసులు కూడా నమోదు అవుతుండటం విడదల రజనిపై సానుభూతి పెరిగిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీసీ ం కాపు సామాజికవర్గం కలగలిపి ఉండటంతో ఖచ్చితంగా గెలుపు గుర్రం ఎక్కుతారని వైసీపీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. విడదల రజనికి పార్టీ నాయకత్వం అండగా కూడా పుష్కలంగా ఉండటంతో ఈసారి చిలకలూరి పేట నుంచి పోటీ చేయడం ఖాయమని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అక్కడ బలమైన నేతగా విడదల రజని ముద్ర పడ్డారు.

# నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ**

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019-24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

**ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం**

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014-15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019-24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014-19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు.

**అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 'జీరో డెట్ సస్టైనబిలిటీ' స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ.48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ.29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ.50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ-నెగోషియేట్), ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మొత్తం రూ.8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ.29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

**సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ.20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

**P4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన**

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం 'కుటుంబ సాధికారత మిషన్' ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి P4 అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. 'మార్గదర్శి బంగారు కుటుంబం' (వీడీఖ 10-20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం**

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్-1 పనుల కోసం ఇప్పటికే రూ.41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'డబుల్ ఇంజన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజన్ గ్రోత్' వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (VER): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (AER): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ.6-8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (TER): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ.10-12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

**ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

సూర్యాపేట జిల్లా తుంగ˘తుర్తి అసెంబ్లీ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

# నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!

పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది. లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, "గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితుగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి" అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35-40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తున్నాయి.

కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

- మొదటి పేజి తరువాయి

(ఆగస్టు 04) ముంబయిలో గుండెపోటుతో మృతి చెందారు.

ఆయన గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు నటి విపన థప మీడియాకు తెలిపారు. ప్రదీప్ రావత్ తెలుగు, హిందీ, తమిళ సినిమాలతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. తెలుగులో 2004లో వచ్చిన సై సినిమాలో భిక్షు యాదవ్ పాత్రతో చూపించిన విలనిజంతో పాపులర్ అయ్యారు. ఆ సినిమాకు బెస్ట్ విలన్ గా ఫిలింఫేర్ అవార్డు కూడా అందుకున్నారు. ఆ తర్వాత గజినీ, భద్ర,అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్ మొదలైన సినిమాలతో తన విలనిజాన్ని పండించారు. లేటెస్టుగా వాల్తేరు వీరయ్య, గాయపడ్డ సింహం సినిమాల్లో నటించారు.

1952లో జబల్పూర్ లో జన్మించారు. ఆయనకు భార్య కళ్యాణి రావత్, ఇద్దరు కుమారులు విక్రమ్ రావత్, సింగ్ రావత్ లు ఉన్నారు. బీ.ఆర్ చోప్రా తెరకెక్కించిన మహాభారతంలో అశ్వత్థామ పాత్రతో ఆయన వెండితెరకు పరిచయమయ్యారు.

ప్రదీప్ రావత్ దాదాపు 80 సినిమాల్లో నటించారు. హిందీలో సర్ఫరోష్, లగాన్, దీవార్, గజినీ సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మొదటి పేజి తరువాయి

సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

తమిళనాడులో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, అనంతరం విడుదల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ పరిణామంపై ఉదయనిధి తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. "అహంకారం వినాశనానికి దారితీస్తుంది. అహంభావం మితిమీరితే పతనం మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన హెచ్చరించారు. ప్రముఖ నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలు వచ్చేలా వ్యాఖ్యానించారన్న ఆరోపణలతో పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను మంగళవారం అరెస్టు చేశారు. సుమారు నాలుగు గంటలపాటు విచారించిన అనంతరం ఆయనను విడుదల చేశారు. అయితే, తన ప్రసంగంలో ఎలాంటి అసభ్యత లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. కావేరి జలాల సాధనలో, మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను తాను ప్రశ్నించినందుకే, కక్షపూరితంగా ఈ చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్పందించే ధైర్యం లేక, కావేరి అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం ఉదయనిధిని అరెస్ట్ చేసిందని ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ఒక్కరోజు ముందు ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఆయనను సభకు హాజరుకాకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులు, విద్యార్థులు, రైతుల గొంతు నొక్కేందుకు టీవీకే ప్రభుత్వం అరెస్టులను ఒక ఆయుధంగా వాడుకుంటోందని డీఎంకే నేతలు విమర్శలు గుప్పించారు.

# డ్రోన్ సాంకేతికతతో అడవుల్లో విత్తన బంతులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 4** :చింతపల్లి డీఎఫ్ఓ ఆదేశాల మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ (విత్తన బంతులు) వేయించారు. దుచ్చరపాలెం, దేరల, కంపుమానుపాకలు, చీ పురుగొంది గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో సీడ్ బాల్స్‌ను విస్తరించారు. అడవుల్లో సహజ పునరుత్పత్తిని ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు.డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వేయించే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీ నగర్ ఎఫ్ఆర్ఓ ఎస్. వెంకటరావు, ఎఫ్ఆర్ఓ ట్రైనింగ్ కె. మణికంఠ, డిప్యూటీ రేంజ్ అధికారి కె. కృష్ణారావు, ఆర్వీ నగర్ ఎఫ్ఎస్ఓ బి. రమేష్‌గిరి, గూడెం ఎఫ్ఎస్ఓ డి. పుష్పవతి, గూడెం ఎఫ్‌బీవో ఆర్. వీరభద్ర, జీకే వీధి సిబ్బంది ఎం. భూషణం, ఆర్వీ నగర్ ఎఫ్‌బీవో ఎస్. ఈశ్వరరావుతో పాటు బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# పీ.వి. సింధు అకాడమీకి మరోసారి శంకుస్థాపన..!








- పెన్ పవర్ ప్రత్యేక కథనం
- 2024లో సింధు భూమిపూజ చేసిన ప్రాజెక్ట్‌కు నేడు మంత్రి లోకేష్ అధికారిక ప్రారంభం
- క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధా..? లేక రాజకీయ ప్రాధాన్యతా..? స్థానికుల్లో చర్చ

**విశాఖ తూర్పు, పెన్ పవర్, ఆగస్టు 4**:విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలోని అరిలోవ--పెద్దగదిలి జంక్షన్ సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చేపట్టనున్న పీ.వి. సింధు బ్యాడ్మింటన్ అండ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ మరోసారి వార్తల్లో నిలిచింది. ఇప్పటికే ఒలింపిక్ పతక విజేత పీ.వి. సింధు చేతుల మీదుగా భూమిపూజ జరిగిన ఈ ప్రాజెక్టుకు, నేడు రాష్ట్ర హెచ్ఆర్డీ, విద్యాశాఖ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ అధికారికంగా శంకుస్థాపన చేయనుండటం రాజకీయ, క్రీడా వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ నేపథ్యంలో "ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్ట్‌కు మరోసారి శంకుస్థాపన అవసరమా?" అనే ప్రశ్న స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.

**మూడెకరాల్లో అత్యాధునిక క్రీడా కేంద్రం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021లో ఈ ప్రాజెక్టు కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించింది. అనంతరం మరో ఎకరం జోడించి మొత్తం మూడు ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

2024 నవంబర్ 7న ఒలింపిక్ పతక విజేత పీ.వి. సింధు తన తల్లిదండ్రులతో కలిసి సంప్రదాయ పద్ధతిలో భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు.

మొదటి దశలో అంతర్జాతీయ ప్రమాణాలతో తొమ్మిది బ్యాడ్మింటన్ కోర్టులు, అత్యాధునిక జిమ్, ఫిట్‌నెస్ సెంటర్, శిక్షణా సదుపాయాలు, దాదాపు 70 మంది క్రీడాకారులకు వసతి గృహాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

నిర్మాణ పనులను 18 నెలల్లో పూర్తి చేసి తొలి దశను 2028 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రాజెక్టు యాజమాన్యం లక్ష్యం. ఈ కేంద్రం పూర్తయితే విశాఖపట్నం మాత్రమే కాకుండా ఉత్తరాంధ్ర ప్రాంత యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందుబాటులోకి రానుంది.

**స్థలంపై కొనసాగుతున్న వివాదం**

ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించిన స్థలం విషయంలో గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసే అవకాశాల నేపథ్యంలో, విద్యార్థులకు అదనపు తరగతి గదులు, క్రీడా మైదానం అవసరమని స్థానికులు, గ్రామ పెద్దలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రస్తుతం క్రీడా కేంద్రానికి కేటాయించిన భూమినే విద్యా అవసరాలకు వినియోగించాలని పలువురు అభిప్రాయపడుతుండగా, మరోవైపు రాష్ట్ర స్థాయిలో ప్రతిష్ఠాత్మక స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటును ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. దీంతో అభివృద్ధి అవసరాలు, స్థానిక విద్యా అవసరాల మధ్య సమతుల్యత ఎలా సాధిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

**మరోసారి శంకుస్థాపన ఎందుకు?**

ఇప్పటికే 2024 నవంబర్ 7న పీ.వి. సింధు భూమిపూజ చేసిన ప్రాజెక్టుకు మళ్లీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అధికారిక శంకుస్థాపన జరగడం పట్ల రాజకీయ వర్గాల్లోనూ, స్థానిక ప్రజల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త పాలనలో ప్రాజెక్టును అధికారికంగా పునఃప్రారంభిస్తున్నారా? లేక నిధుల విడుదల, పరిపాలనా అనుమతుల ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**కొసమెరుపు ఏంటంటే...?**

పీ.వి. సింధు పేరుతో విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా కేంద్రం ఏర్పాటు కావడం రాష్ట్ర క్రీడా రంగానికి శుభపరిణామమే. అయితే ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టుకు మరోసారి శంకుస్థాపన నిర్వహించడం వెనుక పరిపాలనా అవసరాలున్నాయా, లేక రాజకీయ ప్రాధాన్యత ఉందా అనే అంశంపై ప్రభుత్వం అధికారికంగా వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో స్థానిక విద్యార్థుల అవసరాలు, ప్రజల అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి--విద్య మధ్య సమతుల్య పరిష్కారం చూపితేనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రజల మద్దతును పూర్తిగా పొందగలదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు




## 'సంజీవని' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం..
## ఆదివాసీ దినోత్సవం, స్వాతంత్ర్య వేడుకలపై కలెక్టర్ సమీక్ష

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్‌పవర్, ఆగస్టు 4:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన, జిల్లాలో 'సంజీవని' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ టి. నిషాంతి మంగళవారం సమీక్ష నిర్వహించారు. పాడేరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ నెల 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'సంజీవని' పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్న నేపథ్యంలో ఆరోగ్య సేవలు, ప్రజల నమోదు, డిజిటల్ రిజిస్ట్రేషన్, వైద్య శిబిరాలు, తాగునీరు, షామియానాలు, అంబులెన్స్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రత, ప్రోటోకాల్, హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, సభా ప్రాంగణం, మీడియా గ్యాలరీలు, ప్రజా సౌకర్యాల ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, వారసత్వంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ అధికారులకు సూచించారు.80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సమీక్షించారు. పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానం, ఆహ్వానితుల ఏర్పాట్లు, పరిశుభ్రత, విద్యుత్, తాగునీటి సదుపాయాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.కార్యక్రమాలన్నింటినీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ నిషాంతి ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో నిర్ణీత గడువులోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, అదనపు ఎస్పీ శృతి, డీఆర్వో ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు నాణ్యమైన భోజనం తో పాటు విద్య అందించాలి...!





## కేజీబీవీ, గిరిజన సంక్షేమ పాఠశాలను ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శిరీషదేవి ఆకస్మిక తనిఖీ.

**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 4 :** పాఠశాలలో విద్యార్థులకు నిత్యం నాణ్యతతో కూడిన భోజనాలను (రోజువారి మెనూ ప్రకారం) అందించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. కేజీబీవీ స్టాక్ రూమ్ లో కలిగి ఉన్న కూరగాయలను పరిశీలించిన చైర్మన్ ఈ కేజీబీవీ పాఠశాల నుండే అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు కు ఫోన్ చేసి కస్తూరీ భా పాఠశాల మరియు కళాశాల విద్యార్థినీలకు అందించే భోజనాన్ని ఏ రోజైనా తనిఖీ చేశారా.. ఇక్కడ పర్యవేక్షణ లేక మెండర్ పాఠశాలలకు నిత్యవసర సరుకులు కూరగాయలు వేసే అతను నాణ్యమైన సరుకులు పాఠశాలలకు వెయ్యాలని ఆమె ఏపీసికి సూచించారు. కిచెన్ గది లో శుభ్రత పాటించాలని లేకపోతేరోగాలు వచ్చే అవకాశం ఉందని,లేకపోతే రోగాలు వచ్చే అవకాశం ఉందని ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శిరీషదేవి ఏపీసీ కి ఆదేశించారు. అనంతరం భోజన సౌకర్యం పై పిల్లలను అడిగితెలుసుకోగా నాణ్యమైన భోజనం పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలో స్థానిక విద్యా శాఖ అధికారి పలువురు అధికారులు పాల్గొన్నారు.అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ తనిఖీ చేశారు. ఇక్కడ పాఠశాల హెచ్ ఎం, డిప్యూటీ వార్డెన్ ను కలిసి విధ్యార్థులకు శుభ్రత తో కూడిన ఆహారాన్ని అందించాలని,సకాలంలో విద్యా, ఆరోగ్య సంరక్షణ కల్పించాలని కమిషనర్ శిరీషదేవి ఆదేశించారు.ఈ పర్యటనలో ఎస్టీ కమిషన్ సభ్యులు రేగం మాత్యలింగం, ఏపీఐఐసి డైరెక్టర్ జి పెద్దిరాజు, ఏపీ స్టేట్ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ షేక్ సుభాన్, ఏపీ అసెంబ్లీ జాయింట్ సెక్రెటరీ సుబ్బారెడ్డి, ఏపీ అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ నాగమున్నయ్య,పలువురు అధికారులు, నాయకులు . పాల్గొన్నారు

## విశాఖ లోనే రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు (ఆర్ఆర్ బి) సెంటర్ పెట్టాలి - సిపిఐ డిమాండ్




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** విశాఖపట్నంలోనే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బి) పెట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ కె రహిమాన్ లు డిమాండ్ చేశారు. మంగళవారం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ మన దేశంలో కోల్కత్తా మెట్రో, కొంకణ్ రైల్వే లతో కలిపి 19 రైల్వే జోన్లు ఉన్నాయని, ఆర్ ఆర్ బి కేంద్రాలు 21 ఉన్నాయని అన్ని ఆర్ ఆర్ బి కేంద్రాలు జోన్ హెడ్ క్వాటర్ లోనే ఉన్నాయని, అనేక పోరాటాలు చేసి సాధించుకున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ హెడ్ క్వార్టర్ విశాఖపట్నం లోనే ఆర్ ఆర్ బి కేంద్రం పెట్టాలని సిపిఐ తరుపున డిమాండ్ చేశారు.
ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఆర్ ఆర్ బి సెంటర్ అమరావతిలో పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సరియైనది కాదని తెలిపారు.
ఎ రకమైన రసాయిన పరిశ్రమలు వచ్చినా ఉత్తరాంధ్ర లోనేనా, ఇటీవల డేటా సెంటర్లు అన్ని ఉమ్మడి విశాఖ జిల్లా లోనే పెడుతూ ఇక్కడ పర్యావరణం నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని కేంద్రంలో డేటా సెంటర్లు పెట్టుకోవచ్చు కదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ హెడ్ క్వార్టర్ విశాఖలోనే ఆర్ ఆర్ బి సెంటర్ పెట్టడం వలన ఉత్తరాంధ్ర విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.పలువురు జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గాజువాకలో రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతి



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** గాజువాక పరిధిలోని షీలానగర్--గవర జగ్గయ్యపాలెం క్యాబిన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కలకలం రేపింది.
మృతుడు ఆళ్ల సత్తిబాబు (45)గా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆయన రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.
మృతికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

### విజ్ఞాన్ దువ్వాడలో హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ప్రారంభం




**కూర్మన్నపాలెం :పెన్ పవర్, ఆగస్టు 4,** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో కోడింగ్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, కాంపెటిటివ్ ప్రోగ్రామింగ్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ను ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థులతో పాటు సీఎస్ఈ అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులకు కోడింగ్ ప్రాక్టీస్, హ్యాకథాన్‌లు, సాంకేతిక పోటీలు, కాంపెటిటివ్ ప్రోగ్రామింగ్‌లో పాల్గొనే అవకాశాలు కల్పించడంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ క్లబ్ వేదికగా నిలవనుంది. కార్యక్రమంలో వివిధ సాంకేతిక బృందాలను కూడా పరిచయం చేశారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, సీఎస్ఈ విభాగాధిపతి బి. దినేష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అభినందించి, హ్యాకర్‌ర్యాంక్ ఆన్‌క్యాంపస్ క్లబ్ ఏర్పాటు చేసిన అధ్యాపక సమన్వయకర్తలు, విద్యార్థులను అభినందించారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థుల్లో కోడింగ్ ప్రతిభ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందడంతో పాటు పోటీ ప్రోగ్రామింగ్ మరియు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. మహంతి మోహన్ మరియు వై. శ్రీలత సమన్వయం చేశారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు కార్మిక చట్టాలను అములు చేయాలి

- ఏఐటీయూసీ నేత పడాల రమణ డిమాండ్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 4 :** . గ్రామపంచాయతీ ఽ స్వచ్ఛభారత్ కార్మికులు క్లాప్ మిత్రలు పెండింగ్. పారిశుధ్య వాటర్ సప్లై ఎలక్ట్రీషన్ లుగా విధులు నిర్వహిస్తున్నా వారికి కార్మిక చట్టాలు అమలు చేసి సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని కోరుతూ అందరి ప్రదేశ్ గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆనందపురం మండల కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం ఎంపీడీవో బి. సత్యనారాయణ గారికి సమస్యలతో కొన్ని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ అనేక గ్రామపంచాయతీలలో జీతాలు రాక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం గానీ అధికారులు గానీ కనీసం స్పందించకపోవడం పని చెప్పే అధికారులకు జీతాలు ఇవ్వాలనే కనీస స్పృహ లేకపోవడం సిగ్గుచేటు సంవత్సరాలుగా గ్రామాల్లో ప్రజలకు సేవ చేస్తూ గ్రామాల శుభ్రం చేస్తూ తమ జీవితాలను ప్రణంగా పెట్టి ప్రజల జీవితాలలో కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం నమ్మక నేరేతరులు వివరిస్తుందని మరోపక్క రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చేయని సంబరపడుతున్న పాలకులు ఈ అవార్డులు రావడానికి కారణమైన శ్రమజీవులు ఎందుకు గుర్తు రావడం లేదు ఆకలి మంటలు జబ్బులు మాకా. అవార్డులు మీకా అని ప్రశ్నించారు కార్మికులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వీధులు, కాల్వలు శుభ్రం చేయడమే కాకుండా అనేక రకాల పనులు ఉపయోగిస్తున్నారు. గ్రామాలు శుభ్రంగా ఉండాలని పంచాయితీఅధికారులు, సచివాలయ సిబ్బంది మొదలైన వారు నిరంతరం పనిలో ఉంచుతున్నారు. మాకు జీతాలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసినా, అధికారులు అమలు చేయలేదు. జీతాలు ఇవ్వలేదు. జీతాలు అడిగితే పనులు మానుకోమని బెదిరిస్తున్నారు. అని ఆవేదన వ్యక్తం చేశారు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో కాంట్రాక్టర్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య ఎలక్ట్రికల్ వాటర్ సప్లై కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలు కూడా నెలలు తరబడి ఇవ్వడం లేదు అడిగితే మాకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు చెబుతూ పంచాయతీ కార్మికుల్ని శ్రమదోపిడి చేస్తున్నారు వెంటనే తమరు కలుగజేసుకొని పెండింగ్ లో ఉన్న జీతాలు ఇప్పించవలసిందిగా కోరుతున్నాము. 2020న జీవో విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 6000/-ల నుంచి రూ.10,000/-లకు రూపాయలు జీతం పెంచుతూ 680 జీవోను విడుదల చేసినారు. ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
680 జీవను అములుపరచి పదివేల జీతం ఇవ్వాలి.
పారిశుధ్య కార్మికులుగా గుర్తించి 21. ౹౦౦.వేలు వేతనం ఇవ్వాలి సర్పంచుల ద్వారా కాకుండా ట్రెజరర్ ద్వారానే జీతాలు ఇవ్వాలినీ స్వచ్ఛభారత్ కార్మికులకు 2018 నుంచి ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.
రాజకీయంగా ఎవరిని తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలి.
గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి
పనిముట్లు మాస్కులు, బ్లౌజులు, శానిటైజర్లు ఇవ్వాలి.
డిపిఓ ద్వారా కాని ఎంపిడివో ద్వారా కాని గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలి.
రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయితీలు, డంపింగ్ యార్డులు లేవు, కొత్త షెడ్లు నిర్మించాలి.
పెరుగుతున్న జనాభా ప్రతిపాదికన కార్మికుల సంఖ్య పెంచాలి.
ఈ కార్యక్రమంలో. చెల్లూరి కృష్ణ. సిహెచ్ శంకర్. సత్యనారాయణ స్వామి నాయుడు. కనకరాజు. అప్పలరాజు సూరిబాబు ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు

## పవన్ కళ్యాణ్ ఉద్దానం ప్రజలకు, స్టీల్ ప్లాంట్ కార్మికులకు మరియు యువతకు నమ్మకద్రోహం చేశారు: కాంగ్రెస్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 4 :**జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు, జెన్ జీ యువతకు మరియు విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నమ్మకద్రోహం చేశారని కాంగ్రెస్ నాయకుడు జగన్ మురారి విమర్శించారు.
గతంలో ఉద్దానం ప్రాంతంలో పవన్ పర్యటించి కిడ్నీ బాధితులకు అండగా ఉంటానని, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అక్కడి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి వచ్చాక ఆ వైపు కూడా చూడటం లేదని అన్నారు. ఎన్నికల ముందు విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించి “నాకు అధికారం ఇస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపుతాను” అని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల బాధలు వినడానికి కూడా పవన్ సమయం ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం జనవరిలో స్టీల్ ప్లాంట్‌కు ?11,440 కోట్లు విడుదల చేసినా, అందులో బ్యాంకు వడ్డీలు, వి.ఆర్.ఎస్ తీసుకున్న వారికి సెటిల్మెంట్ చేయడానికే సరిపోలేదని అన్నారు. ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం సహకరించకపోయినా పవన్ కళ్యాణ్ మౌనం పాటిస్తున్నారని, ప్లాంట్‌లో నిత్యం ప్రమాదాలు జరిగి ఎందరో కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేశామని ప్రచారం చేసుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని, అలాగే స్టీల్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు కేటాయించాలి, సొంత గనులు ఇవ్వాలనేది కార్మికుల ప్రధాన డిమాండ్ అని జగన్ మురారి తెలిపారు.
పవన్ కళ్యాణ్ తనను నమ్మిన వారికి నమ్మకద్రోహం చేయడం నేర్చుకున్నారని, అధికార మదంతో, అహంకారంతో యువతపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై లక్షలాది మంది యువత కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తే, కేంద్రం అమానుషంగా విద్యార్థులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించిందని, యువతకు తీవ్ర గాయాలయ్యాయని, దేశమంతా ఖండించిందని అన్నారు. దాని గురించి పవన్ కళ్యాణ్‌కు బాధ కలగలేదు, కన్నీరు కారలేదు, కానీ దానికి కారణమైన ప్రధాని మోదీపై జాలి చూపిస్తున్నారని విమర్శించారు. యువత సహకారంతోనే సినిమా రంగంలో పవర్ స్టార్ అయ్యారని, రాజకీయ పార్టీ పెట్టి రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యారని, అలాంటి జెన్-జీ యువతను పవన్ విమర్శిస్తున్నారని జగన్ మురారి అన్నారు.
గతంలో భోగాపురం విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు అండగా ఉంటానని చెప్పారని, ఇప్పటికీ చాలా మంది రైతులకు నష్టపరిహారం అందకపోయినా ఆయనకు పట్టడం లేదని అన్నారు.
పవన్ కళ్యాణ్ పచ్చి అవకాశవాది అని, గతంలో మోదీని తిట్టిన నోటితోనే ఈరోజు భజన చేస్తున్నారని, పవన్ కళ్యాణ్ లాంటి ఊసరవెల్లి గురించి తెలిస్తే చేగువేరా ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు, యువత పవన్ కళ్యాణ్‌కు గట్టి బుద్ధి చెబుతారని జగన్ మురారి అన్నారు.

## తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం.

- పుట్టిన అరగంటలోపు తల్లిపాలను పట్టించాలి.
- సిడిపిఓ సిహెచ్ శ్రీదేవి.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.** తల్లిపాలకు మించిన అమృతం మరొకటి లేదని పుట్టిన అరగంటలోపు తల్లి బిడ్డలకు ఇవ్వడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని అందించిన వారవుతారని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సిహెచ్ శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమసింగి అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలను పట్టించాలన్నారు. కొలస్ట్రం ఫీడింగ్ వలన తల్లులకు మరియు పిల్లలకు కలిగే లాభాలు గురించి ఆమె వివరించారు. తొలి పాలు ( కొలెస్ట్రామ్ ) శిశువుల సహజ రోగనిరోధక శక్తికి పెంపొందించి అనేక వ్యాధుల బారి నుంచి రక్షిస్తాయి అన్నారు. బిడ్డల ఎదుగుదలకు దోహదం చేయడంతో పాటు తల్లి బిడ్డల మధ్య పేగు బంధాన్ని బలపరుస్తాయన్నారు బాలింతలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమసింగి అంగన్వాడీ కేంద్రం సెక్టార్ సూపర్వైజర్ డి. విజయభారతి, పశువుల బంధ అంగన్వాడీ కేంద్రం సూపర్వైజర్ ఎస్ గౌరీ, నెల్లూరు మెట్ట అంగన్వాడి కేంద్రం జి సౌజన్య, కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రం డి తులసి ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి




**లబ్ధిదారులకు రూ.6.54 లక్షల చెక్కుల పంపిణీ**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 04 :** దక్షిణ నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీ.ఎం.ఆర్ఎఫ్ ద్వారా మంజూ రైన ఆర్థిక సహాయ చెక్కులను మంగళవారం విశాఖ జనసేన పార్టీ నగర కార్యాలయంలో పంపిణీ చేశారు. దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే, విశాఖ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.వివిధ వార్డులకు చెందిన 16 మంది లబ్ధిదారులకు ఆసుపత్రి చికిత్స ఖర్చుల నిమిత్తం మొత్తం రూ.6,54,009 విలువైన సీ.ఎం.ఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
అనంతరం 37వ వార్డు అధ్యక్షుడు గరికిన రవి ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువత జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సేవే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పంటలపై ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 5:** పంటల సాగుపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి ఆధ్వర్యంలో బుధవారం దుచ్చెర్లపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీకే వీధి మండలంలోని దుచ్చెర్లపాలెం, ఏబులం, ఈకట్టువీధి, అరటిచెట్లవీధి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ డి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రైతులు సాగు పద్ధతుల్లో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి నాట్లు ఆలస్యమైతే దగ్గర దగ్గరగా కుదుళ్లు వేసుకోవాలని తెలిపారు. దీర్ఘకాలిక రకాలైన శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జీఎల్--2537) వంటి రకాలకు 60 రోజుల వయసున్న నారును కూడా నాటుకోవచ్చని పేర్కొన్నారు.రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు వేసే అవకాశం లేకపోతే ప్రత్యామ్నాయంగా రాగి లేదా కంది పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఏరువాక పాడేరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేష్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే. బయ్యపురెడ్డి, డాక్టర్ పి. బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ బి. వెంకటేష్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వర్షం కోసం 101 బిందెల వారదులు

**గూడెంకొత్తవీధి,పెన్‌పవర్,ఆగస్టు 4:** వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గూడెంకొత్తవీధి మండలం లకవరపు పేట పంచాయతీ కే.కోడిసింగి గ్రామంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి, గ్రామదేవతలకు 101 పసుపు నీళ్ల బిందెలతో వారదులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు, గ్రామ మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా ఏకమై సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమం చేపట్టారు. 101 బిందెలను పసుపు నీటితో నింపి స్వామివారికి సమర్పించారు. స్వామివారు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండితేనే పేద రైతుల కుటుంబాలకు జీవనాధారం లభిస్తుందని తెలిపారు. గ్రామదేవతల ఆశీస్సులతో త్వరలో మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు.



# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన



ఏపీ ఎయిమ్స్ యాప్‌తో పంటల వివరాలు.. సాంకేతిక సలహాలు పొందొచ్చు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 4:** ఎల్‌నినో వాతావరణ ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జీకే వీధి మండలం రంపుల గ్రామంలో ఏపీ ఎయిమ్స్ (ఏపీ ఏఐఎంఎస్)యాప్ వినియోగం, ఎల్‌నినో ప్రభావం-- వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ అధికారి లకే రవీంద్రబాబు పాత్రుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ ఎయిమ్స్ యాప్ వ్యవసాయ రంగంలో ఎంతో ఉపయోగకరమైన డిజిటల్ వేదికగా నిలుస్తోందన్నారు. యాప్ ద్వారా పంటల యాజమాన్యంపై సాంకేతిక సూచనలు, వ్యవసాయ నిపుణుల సలహాలు, చీడపీడలు, వ్యాధుల నివారణ చర్యలకు సంబంధించిన సమాచారాన్ని రైతులు పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా రైతులు తమ పంట ఈ-క్రాప్ నమోదు వివరాలను తెలుసుకోవడంతో పాటు పంటలకు అవసరమైన ఎరువుల మోతాదులు, ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువుల వివరాలు, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు తదితర వ్యవసాయ సేవలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ప్రతి రైతూ ఏపీ ఎయిమ్స్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం, నీటిని పొదుపుగా వినియోగించడం, నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు రైతులతో కలిసి మొక్కజొన్న, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. పంటల ఎదుగుదల, చీడపీడలు, పోషక లోపాలు, కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను పరిశీలించి రైతులకు పంటల పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటలను సంరక్షించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీకే వీధి మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, విహెచ్‌ఏ కృష్ణ, పాడేరు వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. సూర్యనారాయణనాయుడు పాల్గొన్నారు. రంపుల గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.




## వలిసెల పంట సాగు పై శిక్షణ కార్యక్రమం.

అధిక దిగుబడి నిచ్చే నూతన రకం జి ఎన్ ఎస్ 28 విత్తనాల పంపిణీ.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం చింతపల్లి దత్తత గ్రామమైన జీకే వీధి మండలం లోని దుచ్చెర్లపాలెం గ్రామంలో గిరిజన ఉప ప్రణాళిక 2026-27 సంవత్సరానికి గాను వలిసెలు పంటలు మెరుగైన సాగు పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు అధిక దిగుబడి నిచ్చే నూతన రకము జిఎన్ఎస్ 28 వలిసెల విత్తనములు మరియు జీవన ఎరువుల ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ డి ఆదిలక్ష్మి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె బయ్యపురెడ్డి, పాడేరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి ఉమా మహేష్, పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి మరియు శాస్త్రవేత్త డి వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో స్వేప్ కార్యక్రమం



**గుమ్మలక్ష్మీపురంలో ఆగస్టు 04 పెన్ పవర్.** మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,ఈఆర్ఓ బీ.వెంకటరమణ మంగళవారం స్వేప్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ,భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ను 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మీయొక్క పదవ తరగతి మార్కు లిస్టు కలర్ ఫోటో మరియు ఫోన్ నెంబరు,ఫారం -6 తో బిఎల్ఓ కు సంప్రదించాలని నమో చేసుకోవాలని ఆయన

అన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు,బి ఎల్.ఓ.టి సుమతి,డీటీ శేఖరం,కళాశాల సిబ్బంది, శ్రీసూపర్వైజర్ బి అనసూయ,పాల్గొన్నారు.ద

## ఫరీదాబాద్‌లో దారుణం.. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయురాలి హత్య



30 సెకన్లలో పలుమార్లు కత్తితో దాడి.. రెండు గంటల్లో నిందితుడి అరెస్ట్

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా సిక్రోనా గ్రామంలో సోమవారం జరిగిన దారుణ ఘటన తీవ్ర కలకలం రేపింది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 29 ఏళ్ల ఉపాధ్యాయురాలు సంధ్యను ఓ యువకుడు పాఠశాల ఆవరణలో కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి.

పోలీసుల వివరాల ప్రకారం.. ఫరీదాబాద్‌లోని సరస్వతి సీనియర్ సెకండరీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సంధ్యను కలవాలని చెప్పి నిందితుడు పాఠశాల గేటు వద్దకు వచ్చాడు. సమాచారం అందుకున్న సంధ్య బయటకు రాగానే, ముసుగు ధరించిన నిందితుడు ఆమెపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. క్షణాల్లోనే పలుమార్లు కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది.

బాధితురాలిని రక్షించేందుకు ప్రయత్నించిన పాఠశాల నిర్వాహకుడు తేజ్‌పాల్‌పైనా నిందితుడు దాడికి యత్నించడంతో అక్కడ భయాందోళనలు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి, రెండు గంటల్లోనే నిందితుడు అమిత్ (21)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాథమిక విచారణలో సంధ్యకు అమిత్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడిందని, ఆమె నిరాకరించినప్పటికీ తరచూ వేధింపులకు పాల్పడినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో బాధితురాలు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అనంతరం నిందితుడు క్షమాపణలు చెప్పడంతో కేసు ఉపసంహరించుకున్నట్లు సమాచారం. ఆ ఘటనపై కక్ష పెంచుకున్న అమిత్ ప్రతీకారంతో ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆగస్టు 8 మన్యం బందుకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 04 పెన్ పవర్.** జీవో నెంబర్ 03 ప్రత్యామ్నాయ సాధనకై,1/70 చట్టం పరిరక్షణకై ఆగస్టు 8వ తేదీన ఆదివాసి గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన మన్యం బందుకు భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బి.అనిల్ ప్రకటన విడుదల చేశారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో 100% ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకే కేటాయించే జీవో నెంబర్ 3, 2020లో సుప్రీం కోర్ట్ రద్దు చేసిన తర్వాత గిరిజన ప్రాంతంలో చదువుకొన్న యువత నిరుద్యోగులై పట్టణాలకు కూలి పనులకు వెళ్తున్నారని,దీనివల్ల గిరిజన ప్రాంతంలో మరింత నిరక్షరాస్యత పెరుగుతుందని.గిరిజనులు అభివృద్ధికి దూరమవుతారని. 1/70 చట్టం గిరిజన ప్రాంతంలో ఎక్కడ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని,దీనివల్ల గిరిజన భూములకు రక్షణ లేకుండా పోతుందని,గిరిజనులకు ప్రాణాధారమైన పోడు భూములు,గిరిజనులు నుంచి దూరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కావున తక్షణమే



జీవో నెంబర్ 3 కి ప్రత్యామ్నాయ జీవ తేవాలని,1/70 చట్టాన్ని పగడబందీగా అమలు చేయాలని జరిగే ఈ బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఏ.గంగారావు,జిల్లా కమిటీ సభ్యుడు ఏం.నవీన్ పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలి



ప్రజా సంఘాల నాయకులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 04.** జీవో నంబర్-3 చట్టబద్ధత 1/70 చట్టం పటిష్టంగా అమలు కోసం ముంచింగిపుట్టులో 3వ తేదీన జరిగిన ర్యాలీలో పాల్గొన్న గిరిజన ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసులు ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. ర్యాలీలో పాల్గొన్న మాట్లాడిన నేతలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దారుణమని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా గిరిజనులకు కల్పించిన హక్కులు పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే కాలరాస్తుంటే గిరిజనులు ఏకమై ప్రభుత్వాన్ని నిలదీయాలని పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోకుండా, చట్టాన్ని అమలు చేయాలని కోరిన వారిపై కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేసన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని జిఓ నెంబర్ 3ను చట్టభద్దత చేయాలని 1/70 చట్టని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజనుల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకులు కె నర్సయ్య, వి కొండయ్య, రమేష్, కె త్రినాద్, పి భీమరాజు, బి రామారావు, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు బి బాబురావు, సింహాచలం, నర్సింగ్ పాడల్, చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ జెన్‌కో విస్తరణపై ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు

పీడీఎఫ్, పీఏఎఫ్ కుటుంబాలతో అధికారుల సమావేశం



**గూడెం కొత్తవీధి,పెన్‌పవర్ ఆగస్టు 4:** ప్రతిపాదిత ఏపీ జెన్‌కో విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి పునరావాసం, పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) సర్వేలో భాగంగా అధికారులు మంగళవారం సంబంధిత గ్రామాల్లో తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ఆదేశాల మేరకు టీఆర్‌సీ, బుసుకొండ, శాండీకోరి, పార్వతీనగర్ గ్రామాల్లో పీడీఎఫ్, పీఏఎఫ్ కుటుంబాలతో ఈ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన కుటుంబాల వివరాలు, పునరావాసానికి సంబంధించిన అంశాలు, సర్వే ప్రక్రియపై అధికారులు చర్చించారు. కుటుంబాల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ సర్వేను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన కుటుంబాల వివరాలను నమోదు చేయనున్నట్లు అధికారులు వివరించారు.గ్రామసభల్లో ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ, ఎస్‌ఈ, ఏపీ జెన్‌కో అధికారులు, గ్రామస్థాయి రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు. ఆయా గ్రామాల పీడీఎఫ్, పీఏఎఫ్ కుటుంబాలు, గ్రామస్థులు హాజరై తమ సమస్యలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## డిగ్రీ ప్రథమ ( మొదటి)సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం.

చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి రమణ .



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.**

చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 26 -27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి.రమణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బిఏ ఎకనామిక్స్, బిఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, బిఎస్సి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ కంప్యూటర్ కోర్సుల నందు ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందుగూరు విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతపల్లిలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక బోధ, గ్రంథాలయం, ప్రయోగశాలలు విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు ఈ సదవకాశానందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకొని వెంటనే కళాశాలలో ప్రవేశం పొందాలని ఆయన కోరారు. ప్రవేశాల కొరకు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ వి. ఈశ్వర్ లెక్చరర్ ఇన్ కామర్స్ ను సంప్రదించాలని, మరింత సమాచారం కోసం 9493 801827 నంబర్కు సంప్రదించవచ్చునున్నారు.

## గిరిజన పాఠశాలల్లో మరమ్మతులను పరిశీలించిన ఏఈ.

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 04 పెన్ పవర్.** మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డీఏ జుగా పథకం నిధులతో ప్రారంభమైన పనులను ఏఈ రమేష్ మంగళవారం నాడు పరిశీలించారు.ఈ మేరకు రేగిడి,దొరజమ్ము,గొరడ పాఠశాలల్లో ఎలక్ట్రికల్,ప్లంబింగ్,బాత్రూమ్స్,టాయిలెట్స్ రిపేర్ వర్క్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఈ రమేష్ మాట్లాడుతూ,ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని ఆయన తెలిపారు.ప్రతి పాఠశాలలో మరమ్మత్తులు చేయాల్సి ఉందని ఇచ్చిన గడువు లోగా పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలోవర్క్ ఇన్స్పెక్టర్ రవి పాల్గొన్నారు.



# ఆగస్టు 8 బంద్‌తో మాకు సంబంధం లేదు

- 7న ఆదివాసీ అరణ్య గర్జన మహాసభ నిర్వహిస్తాం: ఆదివాసీ జేఏసీ



**జీకే వీధి, ఆగస్టు 4:** ఆగస్టు 8న కమ్యూనిస్టు పార్టీలు తలపెట్టిన మన్యం బంద్‌కు తమకు ఎలాంటి సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, మండల కన్వీనర్ కొర్ర బలరాం, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు లకే రామచంద్రుడు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రీమెల పాలు, నీలకంఠం స్పష్టం చేశారు. ఆగస్టు 7న పాడేరులో నిర్వహించనున్న ఆదివాసీ అరణ్య గర్జన మహాసభకు సంబంధించి మంగళవారం జీకే వీధి పోలీస్‌స్టేషన్‌లో చింతపల్లి డీఎస్పీ తిరుపతిరావుతో ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు 7న పాడేరులో అరణ్య గర్జన మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జీఓ నంబర్ 3 స్థానంలో చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని, 1/70 చట్టానికి సంబంధించిన కేసులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఇంప్లీడ్ కావాలన్నది తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు. ఆగస్టు 8న నిర్వహించనున్న బంద్‌కు తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వడం వల్ల ఆదివాసీల మధ్య విభేదాలు ఏర్పడే పరిస్థితి తలెత్తకూడదని అన్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. ఆగస్టు 7న ఆదివాసీ అరణ్య గర్జన మహాసభ, ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాలపై ఆదివాసీలు అపోహలకు గురికావద్దని జేఏసీ నాయకులు కోరారు. సమావేశంలో జీకే వీధి సీఐ సుధాకర్, ఎస్ఐ సురేష్, సీపీఎం నాయకులు అంపుంగి బుజ్జిబాబు, కొర్ర బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన అవసరం

- మైనర్ డ్రైవింగ్, మద్యం ధూమపానలపై విద్యార్థులు దూరంగా ఉండాలి.
- జి మాడుగుల సిఐ లక్ష్మణరావు, స్థానిక ఎస్సై పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 04.** విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ధూమపానం, మైనర్ డ్రైవింగ్ కు విద్యార్థులు దూరంగా ఉండాలని జిమాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహ విద్యార్థులకు ఎస్సై నాని ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి మంచిగా చదువుకొంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే మైనర్ డ్రైవింగ్, మద్యం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నిరోధక చట్టాలపై విద్యార్థి దశలోనే అవగాహన కలిగి ఉండాలని పలు సలహాలు అందించారు. చెడు వ్యసనాలకు బానిసలై విద్యాకు దూరం కాకూడదన్నారు. అదేవిధంగా అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల 112, 100, 1930 వినియోగంపై పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి మాడుగుల ఎస్సై బి సాయిరామ్ పడాల్, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఈ నెల 11 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్.. 15 నుంచి వెబ్ ఆప్షన్లు



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్‌పవర్, ఆగస్టు 4:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరులో 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఆగస్టు 5 నుంచి 11వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 26న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. అందుబాటులో ఉన్న గ్రూపులు: 1. బీఏ హిస్టరీ, 2. బీఏ పొలిటికల్ సైన్స్, 3. బీఏ స్పెషల్ తెలుగు, 4. బీఏ స్పెషల్ ఇంగ్లిష్, 5. బీకాం జనరల్, 6. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, 7. బీఎస్సీ ఫిజిక్స్, 8. బీఎస్సీ కెమిస్ట్రీ, 9. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, 10. బీఎస్సీ బోటనీ, 11. బీఎస్సీ జువాలజీ, విద్యార్థులు నిర్ణీత గడువులో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ కోరారు.

# ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన డి.ఎస్.పి

## విద్యార్థుల సమస్యలపై ఆరా.. మౌలిక వసతుల పరిశీలన



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 4:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి తనిఖీ చేశారు. చింతపల్లి సబ్‌డివిజన్ పోలీస్ అధికారి (డీఎస్పీ) తిరుమలరావు, సీఐ సుధాకర్, ఎస్ఐ సురేష్‌లతో కూడిన పోలీసు బృందం పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, వసతి గృహాల పరిస్థితి, ఇతర మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలుగుతూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులు సూచించారు. మత్తు పదార్థాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వసతి గృహాల్లో అవసరమైన సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని పాఠశాల సిబ్బందికి అధికారులు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి వాతావరణం కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.

# నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు.

- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించకపోతే కఠిన చర్యలు తప్పవు.
- ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో షెడ్యూల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శిరీష దేవి ఆకస్మిక తనిఖీ



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ శాసనసభ షెడ్యూల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆమె చింతపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు బాలుర, బాలికల ఆశ్రమ వసతి గృహాల్లో ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో విద్యావ్యవస్థ పనితీరును, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి వసతి గృహాల్లోని విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెబుతున్నారా లేదా అన్న విషయాలతో పాటు, వసతి గృహాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం భోజన మెనూ అమలవుతోందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, నాణ్యత ఎలా ఉంటోందనే విషయాలను స్వయంగా వారినే అడిగి వాకబు చేశారు. అనంతరం పాఠశాలలు, వసతి గృహాల పరిసరాలను పరిశీలించిన ఆమె.. ఎప్పటికప్పుడు ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మెనూ నిర్వహణ సక్రమంగా అమలు జరగాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆమె తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఈ ఆకస్మిక పర్యటనలో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే, షెడ్యూల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రేగం మత్యలింగం, ఏపీఐఐసీ డైరెక్టర్ జి. పెద్దిరాజు, ఏపీ రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ షేక్ సుభాన్, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగమునయ్య ఎమ్మెల్యే వెంట ఉన్నారు. అలాగే, స్థానిక అధికారులైన ఎంఆర్ఓ త్రివేణి, ఎంపీడీఓ సీతా మహాలక్ష్మి, ఏటీడబ్ల్యూఓ జయనాగలక్ష్మి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యూరు - కాకరపాడు మధ్య డబల్ రోడ్డు, గ్యాస్ గోడౌన్ మంజూరు చేయ్యండి.

- ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ను కోరిన ఎంపీపీ రమేష్ బాబు.



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 4 :** మూడు దశాబ్దాల క్రితం నుంచి రోడ్డు వెడల్పులేక మండల కేంద్రమైన కొయ్యూరు - కాకరపాడు మధ్య ప్రధాన రహదారి నిర్మాణానికి నిధుల మంజూరు చేయక నిత్యం ప్రయాణించే వాహనదారులు, ప్రజలు, అధికార్లు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నారని దీనికి పూర్తి స్థాయిలో ఉండేందుకు డబల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు కోరారు. కొయ్యూరు మండలంలో మంగళవారం పర్యటించిన ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కలిసి ఎంపీపీ కొన్నేళ్లుగా డబల్ రోడ్డు సౌకర్యంలేక పడుతున్న పరిస్థితి ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ కు వివరించారు. అలాగే 33 పంచాయితీలు కలిగి ఉన్న కొయ్యూరు మండలానికి సుమారు ఏబై వేల కు పైనే గ్యాస్ కనక్షన్లు ఉన్నా గత ఇరవై ఏళ్లుగా కొయ్యూరు మండల కేంద్రంలో ప్రత్యేక గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలని కోరామని దీనిపై ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శిరీషదేవి ఈ ప్రాంత ప్రజల నిత్యవసరమైనటువంటి గ్యాస్ గోడౌన్ ఏర్పాటు కు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రమేష్ బాబు కోరారు.

# 3,4,5 తరగతుల విద్యార్థుల తిరిగి మార్పుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తెలియజేస్తా...!

**ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శిరీషదేవి.**



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 4 :** తమ గ్రామ పాఠశాలలో చదువుతున్న 3,4 5 తరగతుల పిల్లలను సమీప మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో విలీనం చేసి ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాల స్థాయిని నిర్వీర్యం చేయటం పట్ల గింజర్తి గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కొయ్యూరు మండలంలోని పర్యటించిన ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శిరీషదేవి మరియు ఆ కమిటీ సభ్యులు రేగం మాత్యలింగం లకు స్వయంగా తమ పిల్లల భవిష్యత్ పై తెలియజేశారు. గత ఏడాది లోనే గింజర్తి పాఠశాలలోనే కొనసాగుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను ఇక్కడ కు 2 కిలోమీటర్ల దూరంగా ఉన్న చింతలపూడికికి మార్చతంతో తమ పిల్లలు రోజు అనేక వ్యయ ప్రయాసలకు గురై నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నట్లు ఎస్టీ సంక్షేమ కమిటీ దృష్టికి తెలిపారు. దీనిపై స్పందించిన ఆమె మీ అభిప్రాయాన్ని మరియు పిల్లల పరిస్థితి పై జిల్లా కలెక్టర్ దృష్టికి తెలియజేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యులు రేగం మాత్యలింగం, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, స్థానిక ఎం ఈ ఓ సింహాచలం పలువురు అధికార్లు పాల్గొన్నారు.

# గిరిజనుల పక్షాన నిలబడతాం.. సమస్యల పరిష్కారమే మా లక్ష్యం!

- క్షేత్రస్థాయి సమస్యల పరిశీలనలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి.
- చెరపల్లి క్వారీపై కన్నెర్ర, 25 మంది మృతి పట్ల ఆవేదన. రద్దుకు సిఫార్సు.
- చింతపల్లి ఆశ్రమ పాఠశాలలో అస్తవ్యస్త పరిస్థితులపై అధికారులకు అల్టిమేటం.



**చింతపల్లి పవర్ ఆగస్టు 4.** మండలంలోని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. గిరిజనుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. చెరపల్లి గ్రామంలోని క్వారీ కారణంగా స్థానికులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని, కాళ్లు, చేతులు పడిపోయే వింత వ్యాధితో ఇప్పటికే సుమారు 25 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని చైర్మన్ విచారం వ్యక్తం చేశారు. క్వారీని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గ్రామసభ చేసిన తీర్మానాన్ని ఆయన పరిశీలించారు. ఈ తీవ్రమైన సమస్యపై జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులతో స్వయంగా మాట్లాడి గిరిజనుల పక్షాన నిలబడతామని, క్వారీ రద్దు దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చింతపల్లిలోని బాలికల ఆశ్రమ పాఠశాలను, వసతి గృహాన్ని కమిషన్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. అక్కడి అధ్వాన పరిస్థితులను చూసి చైర్మన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 500 మంది విద్యార్థినులున్న హాస్టల్‌లో కేవలం ముగ్గురు సిబ్బంది మాత్రమే పనిచేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ సరిగ్గా అమలు కాకపోవడం, పరిసరాలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని వార్డెన్, డీడీ, ఏటీడబ్ల్యూఓలను ఆదేశించారు. స్థానిక పంచాయతీ సెక్రటరీ వెంటనే స్పందించి, రెండు రోజుల్లోగా హాస్టల్ పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించి ఆ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని కమిషన్ అల్టిమేటం జారీ చేసింది. పర్యటనలో భాగంగా ఎర్నాబిల్లి, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుపై స్థానిక గిరిజనుల అభిప్రాయాలను కమిషన్ సేకరించింది. ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తామని చైర్మన్ వెల్లడించారు.

అనంతరం దిగువపాకల వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు పండు పడాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. తాజంగిలో ట్రైకార్ ద్వారా మంజూరైన మూడు బోట్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తాజంగి డ్యామ్ ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందకపోవడం ప్రధాన సమస్యగా గుర్తించామని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపుతామన్నారు. రాబోయే రెండు రోజుల పాటు అరకు, పాడేరు తదితర గిరిజన ప్రాంతాల్లో తమ పర్యటన కొనసాగుతుందని, ఎల్లుండి ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలపై చర్చిస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ మీడియాకు వెల్లడించారు. ఈ పర్యటనలో చైర్మన్ వెంట రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు జైతి ప్రభాకర్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కదుల్ల శ్రీనివాసరావు, స్థానిక ఎంఆర్ఓ త్రివేణి, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఏటీడబ్ల్యూఓ జయనాగలక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు బీజేపీ నేతలు, స్థానిక పంచాయతీ సెక్రటరీలు, పాఠశాల హెచ్ఎం, వార్డెన్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

# ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిందే.

- నిర్బంధాలు ఆపకపోతే ఉద్యమం మరింత ఉధృతం.
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందించిన ఏపీ గిరిజన సంఘం.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 4.** గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, తమ హక్కుల సాధన కోసం ప్రాణత్యాగాలకైనా సిద్ధమని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డిని గొందిపాకల పంచాయతీ చిత్రాలగొప్పు వద్ద కలిసి ఆయన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు, జీవో నెంబర్ 3కి వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ జీవో రద్దు వల్ల ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని, పాడేరు, రంపచోడవరం జిల్లాలకు 400 ఉపాధ్యాయ పోస్టులు రావాల్సి ఉండగా కేవలం 38 మాత్రమే దక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టులు సైతం గిరిజనులకు దక్కకుండా పోతున్నాయని మండిపడ్డారు. గిరిజనుల భూములకు రక్షణగా ఉన్న 1/70 చట్టం ఏజెన్సీలో పూర్తిగా నిర్వీర్యమైందని చిన్నయ్య పడాల్ ఆరోపించారు. గత 50 ఏళ్లుగా ఐటీడీఏ, రెవెన్యూ అధికారుల వైఫల్యం వల్లే గిరిజనేతరులు ఇక్కడ యథేచ్ఛగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని నిలదీశారు. పెసా గ్రామసభల తీర్మానాలను బేఖాతరు చేస్తూ, ప్రైవేటు సంస్థలు హైడ్రో పవర్ ప్రాజెక్టులు, బాక్సైట్ తవ్వకాల కోసం రహస్యంగా సర్వేలు చేయడం దారుణమన్నారు. గవర్నర్, గిరిజన సలహా మండలి వంటి రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలే గిరిజనులను కాపాడలేకపోతున్నప్పుడు, ప్రభుత్వం వేసిన 'హైపవర్ కమిటీ' కేవలం కాలయాపన కోసమేనని ఎద్దేవా చేశారు. ఒకవైపు ప్రభుత్వమే చట్టాలను ఉల్లంఘిస్తూ, మరోవైపు హక్కుల కోసం పోరాడుతున్న గిరిజన నాయకులు, ఉద్యోగులపై పాడేరు, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆ పోలీసు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కళ్లముందే హక్కులు కరిగిపోతుంటే చూస్తూ ఊరుకోబోమని, గిరిజనులందరినీ ఏకం చేస్తూ ఈ నెల 7వ తేదీన పాడేరులో 'ఆదివాసీ గర్జన', 8న ఏజెన్సీ వ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు చిన్నయ్య పడాల్ ప్రకటించారు. ఈ పోరాటానికి అందరూ సహకరించాలని కోరారు. కాగా, పలు రోడ్ల నిర్మాణాలకు సంబంధించి టీడీపీ మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ బేర సత్యనారాయణ పడాల్ కూడా ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ కూడ కృష్ణారావు, గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## భాగ్యవతి సేవా సంఘం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ పంపిణి



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 04.** మండలంలో గల పెదగూడ పంచాయతీ సారధి ఎంపీపీ పాఠశాల, గలగండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థిని విద్యార్థులకు భాగ్యవతి సేవాసంఘం సభ్యుడు బోర్గం పూర్ణరావు, పెదగుడ పంచాయతీ వైసిపి అధ్యక్షుడు కూడ దాసుబాబు పాఠశాల ఉపాధ్యాయుల చేతులు మీదుగా స్టడీ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూడా దాసుబాబు మాట్లాడుతూ.. గత 7ఏళ్లుగా జర్రెల పంచాయతీ మాజీ సర్పంచ్ భాగ్యవతి సేవా సంఘం ఏర్పాటు చేసి మండలంలో అనేక పాఠశాలలో సొంత నిధులతో విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ తదితర సామాగ్రి అందజేయడం ఎంతో శుభ పరిణామం అన్నారు. మానవత దృక్పథంతో ఇలాంటి సేవ చేయటం కొందరికే దక్కుతుందని ఆయన కొనియాడారు. దీంట్లో భాగంగానే మా పెదగూడ పంచాయతీ సారధి, గలగండ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు 42 మందికి సేవా సంఘం సభ్యుడు పూర్ణారావు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరీ మాట్లాడుతూ.. భాగ్యవతి సేవ సంఘం చేసే ఈ చిన్న సహాయం ఎంతో విలువైనదని ఇది ఎంతో గొప్పదని ఆమె అన్నారు. ఈ రోజుల్లో అనేక మంది ధనికులు చేయలేనటువంటి సహకారాలు సేవ సంఘం ద్వారా చేయడం హర్షించదగినది అన్నారు. విద్యార్థులకు భాగ్యవతి సేవా సంఘం తరఫున స్టడీ మెటీరియల్స్ అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గలగండ పాఠశాల ఉపాధ్యాయురాలు టి గౌతమి, కె మోహన్, అప్పలరాజు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో స్వర్ణపుష్పార్చన, ఖడ్గమాళ సేవలు



**విశాఖపట్నం, ఆగస్టు 4:** శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే స్వర్ణపుష్పార్చన, ఖడ్గమాళ సేవా కార్యక్రమాలు మంగళవారం ఉదయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సేవల్లో ఉభయదాతలు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

దేవస్థాన ప్రధాన అర్చకులు కే. శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో వేదపండితులు, అర్చక స్వాములు పాల్గొని వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి మంగళవారం ఈ సేవలు నిర్వహించబడతాయని, పాల్గొనదలచిన భక్తులు ఆన్‌లైన్‌లో లేదా 'మనమిత్ర' వాట్సాప్ సేవ ద్వారా 9552300009 నంబర్‌ను సంప్రదించి సేవా టికెట్లు పొందవచ్చని దేవస్థానం అధికారులు తెలిపారు.

# ఆరిలోవ హెల్త్ సిటీలోని ఆసుపత్రులపై జీవీఎంసీ ఆకస్మిక తనిఖీలు

- జీవీఎంసీ బల్క్ వాటర్‌ను వినియోగించకుండా, అనుమతి లేకుండా బోర్‌వెల్ ల ద్వారా భూగర్భ జలాల వినియోగంపై కఠిన చర్యలు.
- జీవీఎంసీ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** జీవీఎంసీ పరిధిలోని ఆరిలోవ హెల్త్ సిటీ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రుల్లో భూగర్భ జలాలను అనుమతి లేకుండా వినియోగించడం వలన పరిసర ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు మంగళవారం పలు ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా పర్యవేక్షక ఇంజనీర్ మాట్లాడుతూ, తనిఖీల సందర్భంగా కొన్ని ఆసుపత్రులు జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్లు తీసుకున్నప్పటికీ వాటిని వినియోగించకుండా, బోర్‌వెల్‌ల ద్వారా అధికంగా భూగర్భ జలాలను వినియోగిస్తున్నట్లు, మరికొన్ని ఆసుపత్రులు జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ తీసుకోకుండానే పూర్తిగా భూగర్భ జలాలను అనుమతి లేకుండా వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలకు ఏడు రోజుల్లోగా జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, అలాగే అనుమతి లేకుండా బోర్‌వెల్‌ల ద్వారా భూగర్భ జలాలను వినియోగించరాదని స్పష్టం చేస్తూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన తాగునీటిని నిరంతరాయంగా అందించడం జీవీఎంసీ ప్రధాన లక్ష్యమని పల్లంరాజు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ భూగర్భ జలాలను అక్రమంగా వినియోగించే ఆసుపత్రులు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజలకు తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, వార్డు అమెనిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి బృందంపై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం



- జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు
- ఎలమంచిలి నియోజకవర్గంలో కూటమి నాయకులు చేస్తున్న అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని పరిశీలించేందుకు వెళ్లిన సాక్షి మీడియా బృందాన్ని కూటమి నాయకులు అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని
- జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ కెకె రాజు తీవ్రంగా ఖండించారు.

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించడానికి వీల్లేదంటూ సాక్షి బృందాన్ని అడ్డుకోవడమే కాకుండా, అక్కడి పరిస్థితులను వీడియో చిత్రీకరిస్తే అక్రమ కేసులు నమోదు చేస్తామని బెదిరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. బెదిరింపులకు లొంగకుండా తమ విధి నిర్వహణలో భాగంగా నిజాలను నమోదు చేయడానికి ప్రయత్నించిన సాక్షి బృందాన్ని అడ్డుకోవడం, వారిపై ఒత్తిడి తీసుకురావడం, అక్రమ కేసులు పెడతామని హెచ్చరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని కెకె రాజు అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు స్వేచ్ఛగా వార్తలను సేకరించి ప్రజలకు చేరవేసే హక్కు ఉందని, మీడియాపై దాడులు, బెదిరింపులు, అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సాక్షి బృందాన్ని అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ మైనింగ్ ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి నిజాలను ప్రజల ముందుంచాలని జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ కెకె రాజు డిమాండ్ చేశారు.

## విశాఖలో స్క్రాప్ షాపులపై పోలీసుల మెగా తనిఖీలు

- భారీగా విద్యుత్ కేబుళ్లు, రాగి వైర్లు, వాటర్ ట్యాప్‌లు స్వాధీనం.. కేసుల నమోదు



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా స్క్రాప్ షాపులపై పోలీసులు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 65 ప్రత్యేక బృందాలు, సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో మొత్తం 288 స్క్రాప్ షాపులను తనిఖీ చేశారు.

తనిఖీల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు, ఫుటేజ్ నిల్వ విధానం, ట్రేడ్ లైసెన్సులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్, కొనుగోలు--అమ్మకాల రిజిస్టర్లు, డిజిటల్ చెల్లింపు సదుపాయాలు, అగ్నిమాపక పరికరాలు, బాల కార్మికుల వినియోగం, వాహన స్క్రాపింగ్ నిబంధనల అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే నకిలీ నంబర్ ప్లేట్లు, అనధికారికంగా నిలిపిన వాహనాలు, దొంగిలించబడిన ప్రభుత్వ ఆస్తులు లేదా రైల్వే, స్టీల్ ప్లాంట్‌కు చెందిన వస్తువులు ఉన్నాయా అనే కోణంలోనూ తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో 62 కేజీల భూగర్భ విద్యుత్ కేబుల్, 100 నీటి పంపుల (వాటర్ ట్యాప్‌లు), 14 ఎలక్ట్రికల్ వైర్ కాయిల్స్, 68 కేజీల అల్యూమినియం హై-వోల్టేజ్ విద్యుత్ వైర్లు, 30 కేజీల తెల్ల రాగి, రాగి కేబుళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీజ్ చేసిన వస్తువులను సంబంధిత క్రైమ్ పోలీస్ స్టేషన్లకు అప్పగించి కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని స్క్రాప్ షాపుల్లో అక్రమ కార్యకలాపాలు, ప్రమాదకరమైన నిర్వహణ లేదా నిర్లక్ష్యం వెలుగుచూస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

## ఆటోలో మరిచిపోయిన బంగారు దిద్దులు, సర్టిఫికెట్ల బ్యాగు.. గంటల్లోనే గుర్తించి అప్పగించిన టూటౌన్ పోలీసులు



**విశాఖపట్నం, ఆగస్టు 4:** ఆటోలో మరిచిపోయిన బంగారు చెవి దిద్దులు, విద్యా సర్టిఫికెట్లతో కూడిన బ్యాగును టూటౌన్ క్రైం పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించి బాధిత యువతికి అందజేసి తమ చాకచక్యాన్ని చాటుకున్నారు.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేఘన హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆమె, శ్రీకాకుళం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో మూడు గ్రాముల బంగారు చెవి దిద్దులు, విద్యా సర్టిఫికెట్లు ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు.

బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన మేఘన వెంటనే టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన ఎస్ఐ సీహెచ్. చిరంజీవరావు, హెడ్ కానిస్టేబుల్ ఎండి. హఫీజ్జుల సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి సంబంధిత ఆటోను గుర్తించారు. అనంతరం ఆటో డ్రైవర్ వద్ద నుంచి బ్యాగును స్వాధీనం చేసుకుని అందులోని వస్తువులతో సహా మేఘనకు అప్పగించారు.

తన విలువైన వస్తువులు, ముఖ్యమైన సర్టిఫికెట్లు సురక్షితంగా తిరిగి అందించిన టూటౌన్ క్రైం పోలీసులు ఎస్ఐ చిరంజీవరావు, హెడ్ కానిస్టేబుల్ హఫీజ్జుల సేవలను మేఘన అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# మాస్కోలో 5వ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సమ్మిట్‌లో విశాఖ అభివృద్ధి విజన్‌ను ఆవిష్కరించిన ఎంపీ ఎం. శ్రీభరత్.




* జీవీఎంసీ--మాస్కో ప్రభుత్వాల మధ్య సహకార ఒప్పందం... ప్రపంచస్థాయి సాంకేతికతలు, ఉత్తమ విధానాల భాగస్వామ్యానికి నాంది.
* జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** రష్యా రాజధాని మాస్కోలో నిర్వహించిన 5వ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సమ్మిట్లో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ విశాఖ నగర అభివృద్ధి విజన్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణాభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ మరియు మాస్కో ప్రభుత్వాల మధ్య మెమోరాండం ఆఫ్ కోఆపరేషన్ (వీశీజ) కుదిరిందని, అనంతరం మాస్కో డిప్యూటీ మేయర్ మరియు రవాణా, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖాధిపతి మక్సిమ్ లిక్సుటోవ్తో సమావేశమై పరస్పరం అభినందనలు తెలియజేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మార్గదర్శకత్వంలో విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్కో ప్రభుత్వంతో కుదిరిన ఈ సహకార ఒప్పందం ద్వారా ప్రపంచస్థాయి సాంకేతికతలు, వినూత్న రవాణా విధానాలు, ఉత్తమ పట్టణాభివృద్ధి నమూనాలను విశాఖకు తీసుకురావడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, సమ్మిట్ సందర్భంగా అంతర్జాతీయ ప్రతినిధులకు జీవీఎంసీ అమలు చేస్తున్న ప్రాజెక్ట్ సారథి (ాూ=ుఎ×) -- ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (×ుమీూ), వ=ు రవాణా వ్యవస్థ, సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌ల అభివృద్ధి, ప్రధాన రహదారుల విస్తరణ, డిజిటల్ పౌర సేవలు, సాంకేతిక ఆధారిత తాగునీటి సరఫరా పర్యవేక్షణ, జనన--మరణ ధ్రువీకరణ పత్రాల డిజిటల్ సేవలు, స్మార్ట్ వెండింగ్ జోన్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ తదితర కార్యక్రమాల గురించి వివరించినట్లు తెలిపారు.

మాస్కో ప్రభుత్వంతో కుదిరిన ఈ సహకార ఒప్పందం ద్వారా స్మార్ట్ మొబిలిటీ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ (×ుూ), ఎలక్ట్రిక్ రవాణా, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, డిజిటల్ పరివర్తన రంగాల్లో ప్రపంచస్థాయి అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకునే అవకాశం లభిస్తుందని కమిషనర్ తెలిపారు.

ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖలో ఆధునిక పట్టణ రవాణా పరిష్కారాల అమలుకు మరింత ఊతం లభిస్తుందని, అలాగే విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (ఎజు=) ను ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాస్కో డిప్యూటీ మేయర్ మక్సిమ్ లిక్సుటోవ్ మాట్లాడుతూ, భారతదేశంతో, ముఖ్యంగా విశాఖపట్నంతో ఏర్పడిన ఈ భాగస్వామ్యం ద్వారా విజ్ఞాన మార్పిడి, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పారిశ్రామిక సహకారం తదితర రంగాల్లో దీర్ఘకాలిక సహకారం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

గమనిక: ఈ కార్యక్రమానికి సంబంధించిన మాస్కో డిప్యూటీ మేయర్ మక్సిమ్ లిక్సుటోవ్, విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రసంగాల వీడియోలను ఈ పత్రికా ప్రకటనతో పాటు మీడియాకు జతచేయడం జరిగింది.

## గిరిజన ప్రాంత ఆలయాల అభివృద్ధి ఒక సామాజిక బాధ్యతే...!

### గుడ్లపల్లి సీతారాముల ఆలయానికి రూ.10 వేల విరాళం అందించిన రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**కొయ్యూరు పెన్ పవర్ ఆగస్టు 4 :**మన్యంలో అన్ని ఆలయాల అభివృద్ధి సామాజిక బాధ్యతగా పౌరులు ముందుకు సాగాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి ఆమె క్యాంపు కార్యాలయంలో మంగళవారం అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గుడ్లపల్లి గ్రామస్తులు

సీతారాముల ఆలయ అభివృద్ధి కొరకు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె తన వంతుగా ఆలయ నిర్వహణ అభివృద్ధి కోసం సహాయంగా రూ.10,000/- లు నగదును ఆలయ కమిటీకి అందించారు.. ఈ సందర్భంగా మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ... మన్యంలో ఎలాంటి మత విద్వేషాలు లేకుండా అందరూ సఖ్యతగా ఉండాలన్నారు. ఏ మతమైన మనమంతా భారతీయులం అన్న భావన మనలో ఉండాలన్నారు. సర్వ మతాలను గౌరవించాల్సిన నైతిక బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవుని ప్రార్థనలతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె కోరారు.

గిరిజన ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు కొరకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పెద్దలు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.ద

## కూటమి రెండేళ్ల పాలన అభివృద్ధి సంక్షేమం సమానంగా పరిగెడుతుంది .. పట్టాభి రామ్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మరియు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు గారి ఆదేశాల మేరకు కోటం ప్రభుత్వం రెండేళ్ల పాలనాపై ఇంటింటికి తిరిగే కార్యక్రమం విశాఖ తూర్పు నియోజకవర్గం 17వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతంలో విశాఖపట్నం టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ పాల్గొన్నారు, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ , వార్డు టిడిపి అధ్యక్షులు నెక్కంటి సత్తిబాబు, తారక్, రాము, వర , రాములమ్మ, గోపమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## జడ్.పి.హెచ్.ఎస్ లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 4:** స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో (కోనేటి బడి) విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు సిహెచ్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమానికి పట్టణ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బదిరెడ్డి గోపాలకృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు మూది నారాయణస్వామి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ బడుల పై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, మౌలిక వసతులు కల్పనలో, మెరుగైన విద్యా ప్రమాణాలను అందించడంలో కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరుకు నిదర్శనమే 2025 –26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తమ సత్తాను చాటుతూ విజయాలు సాధించడం జరిగిం దన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నేతృత్వం లో స్కూల్లో చక్కగా రూపుదిద్దు కోవడం తోపాటు మధ్యాహ్న భోజన పథకం పిల్లలకు సకాలంలో చిక్కీలు అందించడం, ఆటపాటలందు శ్రద్ధ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వ బడులను మెరుగు పరిచారన్నారు. ఇదే కోవలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల ను పంపిణీ చేశారు. అలాగే గత వైసిపి ప్రభుత్వంలో షూస్ పంపిణీ విధానం పిల్లలందరికీ సైజులు తేడా వచ్చేవని కూటమి ప్రభుత్వంలో ఏ విద్యార్థిని అయితే ఆ విద్యార్థినికే షూస్, డ్రెస్, బ్యాగ్స్ వారికి సరిపడే సైజులలో పేర్లు కూడా ప్రకటిస్తూ ఇవ్వడం జరిగిందన్నారు. ఉన్నత చదువులు అభ్యసించిన వ్యక్తిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కావడంతో విద్యార్థుల పట్ల అధిక శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పసుపులేటి శ్రీను, ఉపాధ్యాయులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హుకుంపేట మండలంలో రాష్ట్ర ఆహార కమిషన్ ఆకస్మిక తనిఖీలు



### రాష్ట్రఆహార కమిషన్ గంజిమాల దేవి

### విద్యార్థుల భోజన సదుపాయాల్లో అవకతవకలు ఉపేక్షించం.

**హుకుంపేట పెన్ పవర్ ఆగస్టు 4.** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు శ్రీమతి గంజిమాల దేవి పాడేరు, హుకుంపేట మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టళు ్ల, అంగన్వాడీ కేంద్రాలు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, షాపులు, ఎం ఎల్ ఎస్ పాయింట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం ఉదయం జిల్లా లోని పాడేరు హుకుంపేట మండలలో గల ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజనం, అంగన్వాడీలలో బాలామృతం పంపిణీ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలోని వసతులు,రేషన్ డిపోల ద్వారా పంపిణి, ప్రజలకు తూకం తగ్గకుండా సరుకులు అందుతున్నాయో లేదో అనేది స్వయంగా పరిశీలించారు.

ఈ తనిఖీ చేసిన కేంద్రాలు, సంస్థల, హుకుంపేట, పాడేరు మండలంలో పర్యటనల్లో భాగంగా

అంగన్వాడీ కేంద్రం ముల్లుమెట్ట గ్రామం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్ తలారి సింగి, ఎంపీపీ స్కూల్ గుత్తుల పుట్టు ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ గుత్తుల పుట్టు గ్రామం,ఫెయిర్ ప్రైస్ ఎఫ్ పి షాప్ గుత్తుల పుట్టు గ్రామం, అంగన్వాడీ కేంద్రం గుత్తుల పుట్టు గ్రామం,

గవర్నమెంట్ హై స్కూల్ పాడేరు, ఎంపీపీ స్కూల్ గుడివాడ, ఎంపీపీ స్కూల్ సుండ్రు పుట్టు గ్రామం, ఫెయిర్ ప్రైస్ ఎఫ్ పి షాప్ సుండ్రు పుట్టు గ్రామం,

కేజీబీవీ కె జి బి వి లగిసపల్లి గ్రామం, గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ హాస్టల్ శ్రీకృష్ణపురం గ్రామం, మండల లెవల్ స్టాక్ ఎం ఎల్ ఎస్ పాయింట్ పాడేరు

హుకుంపేట మండలం,

కేజీబీవీ కె జి బి వి హుకుంపేట,అంగన్వాడీ కేంద్రం -- దాలిగుమ్మడి గ్రామం ఆమె పర్యటించి ఆయా కేంద్రాల్లో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలపై స్వయంగా పరిశీలించి ఆరా తీశారు.

నాణ్యమైన ఆహారంతో పాటు పాఠశాలలు, ఆశ్రమ హాస్టళ్లలో విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం పరిశుభ్రమైన పోషకాలతో కూడిన ఆహారం అందించాలని ఆదేశించారు.

రేషన్ పంపిణీ లో పారదర్శకత, ఎఫ్ పి షాపుల్లో సరుకుల నిల్వలు, తూకాలు సరిగ్గా ఉండాలని, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బియ్యం పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. పరిశుభ్రత మరియు. తాగునీరు, కేజీబీవీలు, హాస్టళ్లలో తాగునీటి వసతి, వంటగదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ పర్యటన కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి వి.మోహన్ బాబు, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ప్రశాంత్ కుమార్, జిల్లా ఆహార భద్రత అధికారి ఎం గ్రీష్మ, పాడేరు ఐసిడిఎస్ సిడిపిఓ శారద, ఎంఈఓ విశ్వనాథం, ఏటిడబ్ల్యుఓ లు , హుక్కుంపేట ఎంఈ ఓ, మధ్యాహ్నం భోజన కో ఆర్డినేటర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రండి కూటమి పిలుపు



### 11వ వార్డు కూటమి నాయకుల సమావేశం

**విశాఖ తూర్పు,పెన్ పవర్ ఆగస్టు 4 :**విశాఖ తూర్పు నియోజకవర్గం 11వ వార్డు టీడీపీ కార్యాలయంలో మంగళవారం కూటమి భాగస్వామ్య పార్టీల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు మాట్లాడుతూ, బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు అకాడమీ పేరుతో ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేయడానికి రానున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వార్డు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని మంత్రికి ఘన స్వాగతం పలకాలని కోరారు.

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ సభకు 11వ వార్డు నుంచి బస్సుల్లో జనాలను తరలించిన కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

బీజేపీ నాయకుడు మధుపాడ సన్యాసిరావు, జనసేన వార్డు అధ్యక్షుడు సారిపల్లి రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను అందరం కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో నాయుడు,అప్పారావు, మజ్జి లక్ష్మి, చందక లలిత తదితరులు పాల్గొన్నారు.

## 85వ వార్డులో ఇంటింటికి టిడిపి కార్యక్రమం



**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు04:**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలనుసారం 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్ర జోరుగా ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం.

ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో బీసీ కాలనీ, పెదమదక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన కోసం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం నూకరాజు, వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, అగనంపూడి హాస్పిటల్ డైరెక్టర్లు దొక్కా రమేష్, గజ్జల రవణమ్మ నూకరాజు, కొర్రాయి జగదీష్, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, గొడ్డి గురుమూర్తి, కరణం అప్పారావు, గుదే శంకర్రావు, బేత హనుమంతరావు, మహిళా అధ్యక్షురాలు గీతా అన్నపూర్ణ, ఐటీడీపీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి పద్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 1,200 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

### బొలెరో వాహనం సీజ్.. ఒకరి అరెస్ట్




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 4:** విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా, నిల్వ, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో మంగళవారం ఉదయం ప్రకాశ్ నగర్‌లోని సెవెన్ టెంపుల్స్ జంక్షన్ వద్ద మల్కాపురం ఎస్ఐ పి. శ్రీను సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ూూ3్5394 నంబర్ గల మహీంద్రా బొలెరో వాహనం పోలీసులను గమనించి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, వెంటనే అడ్డుకుని తనిఖీ చేశారు.

తనిఖీల్లో వాహనంలో 30 సంచుల్లో మొత్తం 1,200 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న పూసర్ల అచ్చిబాబు (51), దుర్గానగర్, మల్కాపురంను అదుపులోకి తీసుకుని విచారించగా, తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి చోడవరం ప్రాంతంలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనలో సుమారు రూ.18 వేల విలువైన 1,200 కిలోల పీడీఎస్ బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.124/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 318(4)తో పాటు ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం సెక్షన్ 7(1) కింద దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com